సాక్షి విశాఖపట్నం

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



నగరంలో గురువారం జరగనున్న రంజాన్‌కు మక్కా మసీదు, జామియా, యాసిన్ మసీదులను విద్యుత్ దీపాలంకరణ చేశారు.



స్నేహితుడికి సాయం చేయబోయి మృత్యు ఒడికి.. IIలో



ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు IIలో

న్యూస్‌రీల్

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



దాబాగార్డెన్స్: ముస్లింలకు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమని, ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా ఈ నెలను భావిస్తారని చెప్పారు. దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలోనే ఆవిర్భవించిందన్నారు. నెల రోజుల పాటు ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు చేసుకున్నారని తెలిపారు. రంజాన్ పండగను ప్రతీ ఒక్క ముస్లిం ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలని మేయర్ అభిలాషించారు.

ఐఆర్‌ఈఎల్, స్టీల్‌ప్లాంట్ సీఎండీల భేటీ



ఐఆర్‌ఈఎల్ సీఎండీ దీపేంద్ర సింగ్‌తో చర్చిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

ఉక్కునగరం: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్(ఐఆర్‌ఈఎల్) సీఎండీ డాక్టర్ దీపేంద్ర సింగ్‌తో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జరిగిన ఈ భేటీలో ఇరు సంస్థల మధ్య ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్‌డీ) కార్యక్రమాలకు గల అవకాశాల గురించి చర్చించారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉత్పత్తుల గురించి సీఎండీ భట్‌ను దీపేంద్ర సింగ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ఎస్.సి.పాండే, ఐఆర్‌ఈఎల్ డైరెక్టర్ ఆర్.ఎ.ఖలే పాల్గొన్నారు.

చందనోత్సవం సీఎఫ్‌వోగా రామచంద్రమోహన్




సింహాచలం: సింహాచలం క్షేత్రంలో వచ్చే నెల 10న జరిగే చందనోత్సవానికి రాష్ట్ర దేవదాయశాఖ తరఫున చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఆ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ ఈనెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రామచంద్రమోహన్ 2013 నుంచి 2019 వరకు సింహాచలం దేవస్థానం పూర్తిస్థాయి ఈవోగా పనిచేశారు. 2007–08లో దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా కూడా విధులు నిర్వర్తించారు. 2008లోను, 2013 నుంచి 2019 వరకు కలిపి ఈవోగా ఎనిమిది చందనోత్సవాలను నిర్వహించారు. ప్రస్తుతం రామచంద్రమోహన్ దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూనే అన్నవరం దేవస్థానం ఈవోగా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు.

4,716 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం నగరంలోని తోటవీధి(భీమిలి), పెందుర్తి, చినముషిడివాడ, బీసీ రోడ్డు(న్యూ గాజువాక), శ్రామిక నగర్(భరత్‌నగర్), రైల్వే న్యూకాలనీ(అబిడ్‌నగర్), భవానీ గార్డెన్స్(శివాజీపాలెం), గంగవరం, వెంకన్నపాలెం(గంగవరం), ఆర్పీ పేట(జ్ఞానాపురం), పల్లివీధి(గాంధీజీ వీధి), ఏకేసీ కాలనీ(యారాడ), జబ్బరితోట, దొండపర్తి, పాత వెంకోజీపాలెం(రజకవీధి), బాలాజీనగర్(గాంధీనగర్), ఎండాడ(రుషికొండ)లో వైద్య శిబిరాలు జరిగాయి. మొత్తం 17 ప్రాంతాల్లో జరిగిన శిబిరాల్లో 4,716 మందికి వైద్య సేవలందించారు. 27 మందిని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈ నెల 12న పద్మనాభం మండలం పాండ్రంకి, ఆనందపురం మండలం బోనిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణ ఫోరం ప్రధాన కార్యదర్శిగా మాధవీలత



విశాఖలీగల్ : జాతీయ మానవ హక్కుల పరిరక్షణ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన మహిళా న్యాయవాది కె.మాధవీలత నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం జాతీయ అధ్యక్షుడు టి.ఎస్.రామచంద్రనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పరిధిలో మానవ హక్కుల ఉల్లంఘన, అవినీతి ఆరోపణలు, మహిళల పట్ల అకృత్యాలపై ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు న్యాయ సహాయం ఆమె అందిస్తారు. ఆమె నియామకం పట్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దంత నరేష్‌కుమార్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

భలే మంచి లంచ్ బేరం

టీడీపీ నాయకుల నోట్ల రాజకీయం

- లంచ్, డిన్నర్‌కి పిలవడం.. బేరాలు మాట్లాడటం..
- సర్పంచ్ నుంచి ఇన్‌చార్జి వరకూ ఒక్కొక్కరికీ ఒక్కో రేటు
- భీమిలిలో ఓ నేతను రూ.2 కోట్లకు కొనుగోలు చేసిన గంటా
- సర్పంచ్‌కు రూ.2 లక్షలు.. ఎంపీటీసీకి రూ.3 లక్షలు
- బేరం కుదరగానే కండువాలు మార్చేస్తున్న చోటా నేతలు

సాధారణంగా ఒక హోటల్‌లో లంచ్ చేస్తే సుమారు రూ.500 బిల్లు అవుతుంది.. అదే స్టార్ హోటల్ అయితే రూ.1000 నుంచి రూ.1500. కానీ ఉమ్మడి విశాఖ జిల్లాలోని టీడీపీ నేతల ఇళ్లల్లో మాత్రం లంచ్ ఖరీదు రూ.లక్షల్లోనే ఉంటుంది. లంచ్ ఒక్కటే కాదు.. టీ, టిఫిన్, డిన్నర్ ఏదైనా చాలా ఖరీదు చేసేశారు. ఇంతకీ ఈ లక్షల రూపాయల లంచ్ గురించి తెలుసుకుంటే నోరెళ్లబెట్టాల్సిందే.



సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక సమరం సమీపిస్తున్న తరుణంలో ఓటమి తప్పదని గ్రహించిన టీడీపీ అడ్డదారులు తొక్కుతోంది. ఓట్ల రాజకీయంతో పనికాదని గ్రహించి.. నోట్ల రాజకీయాలకు తెర తీసింది. ప్రత్యర్థి పార్టీ నేతలను లంచ్, డిన్నర్‌కి పిలిచి బేరాలు పెడుతోంది. సర్పంచ్ నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకూ ఒక్కొక్కరికీ ఒక్కో రేటు నిర్ణయించేస్తోంది. ఇందులో సిద్ధ హస్తుడుగా ఉన్న గంటా శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకొని.. అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ నేతలు ఇదే ఫార్ములా అవలంబిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ నేతలను సంతలో పశువుల్లా బేరాలాడి కొనేస్తే చాలని లెక్కల్లో తలమునకలయ్యారు. లంచ్, డిన్నర్ పేరుతో లక్షలు ముట్టజెబుతున్నారు.

గంటా రూటే సేపరేట్

టీడీపీ పెద్దల కాళ్లా వేళ్లా బతిమాలి ఎట్టకేలకు భీమిలి టికెట్ సాధించుకున్న గంటాకు ఎన్నికలంటే డబ్బుతో గెలవడమే అనే నైజం. ప్రజలన్నా నాయకులన్నా ఆయన దృష్టిలో ఓటును, వ్యక్తిత్వాన్ని అమ్ముకునే మనస్తత్వం కలవారు. రూ.500కి వెయ్యకపోవచ్చు.. రూ.వెయ్యికి వెయ్యకపోవచ్చు.. రూ.2 వేలు.. ఇలా.. ఏదో ఒక నంబర్ దగ్గర ఓటరు తనకు లొంగుతారనే విర్రవీగే మనస్తత్వంతో రాజకీయాలు చెయ్యడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా మారిపోయింది. ఇదే మాదిరిగా చోటా మోటా నాయకులకు సైతం వెలకడుతున్నారు. గంటా ఒక్కరే కాదు టీడీపీ నుంచి టికెట్ కొనుక్కున్న ప్రతి ఒక్క నాయకుడూ ఇదే రీతిలో ఆలోచిస్తూ రాజకీయాల్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

విలువలు అమ్ముకుంటూ రాయ‘బేరాలు’

వెన్నుపోటు రాజకీయాలు మొదలైనప్పటి నుంచి విలువలను విడిచిపెట్టి అడ్డగోలుకు కేరాఫ్‌గా మారిపోయింది టీడీపీ. అంతా ఆ తాను ముక్కలే అన్నట్లుగా పార్టీలో ఉన్నవారంతా కనీస విలువలు లేకుండా వ్యవహరిస్తున్నారు. డబ్బుతోనే ఏదైనా సాధ్యమనే అహంకారంతో విర్రవీగుతున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థులు తమ ఇంటికి లేదా సమీపంలో ఉన్న ఓ హోటల్‌కి భోజనానికి ఆహ్వానించడం.. రాయ‘బేరాలు’ మాట్లాడుకోవడమే పరమావధిగా రాజకీయాలు చేస్తున్నారు. బేరం కుదిరిన వెంటనే చోటా నేతలు కండువాలు కప్పేసుకుంటున్నారు.

- చోడవరంలో టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ రాజు ఇటీవలే పలువురు ప్రత్యర్థి పార్టీ నేతలను నోట్ల కట్టలతో కొనుగోలు చేసుకున్నారు.
- పాయకరావుపేటలో వంగలపూడి అనిత.. ఓ హోటల్‌లో సామాజికవర్గ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులను ఆత్మీయ సమావేశం పేరిట ఆహ్వానించారు. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడుతూ సర్పంచ్‌కు రూ.2 లక్షలు, ఎంపీటీసీ సభ్యుడికి రూ.5 లక్షలు, 100 ఓట్లు ప్రభావితం చేసే సామాజికవర్గ నాయకుడికి రూ.5 లక్షలకు బేరం పెట్టేసుకున్నారు.
- పెందుర్తిలో పంచకర్ల రమేష్‌బాబు సైతం అదే రాయబేరాలు సాగిస్తున్నారు. ఈయన రూ.లక్ష నుంచి తన బేరాలు మొదలు పెడుతున్నారు.

ఇవి కేవలం మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గడపగడపకు వెళ్లి ప్రజలకు ఇంకా అందించాల్సిన మౌలిక సదుపాయాలు, వారి అభిప్రాయాలు సేకరిస్తుంటే.. టీడీపీ అభ్యర్థులు మాత్రం.. నేతల కొనుగోలులో బిజీబిజీగా గడుపుతున్నారు.

రూ.2 కోట్లకు డీల్..!

భీమిలి నియోజకవర్గంలో జరిగిన బేరం ఖరీదు అక్షరాలా రూ.2 కోట్లు. ఇక్కడ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నాయకుడి మద్దతును టీడీపీ నేతలు కోరారు. అతడు ఒప్పుకోలేదు. బతిమలాడారు.. లంచ్, డిన్నర్‌కు ఆహ్వానించారు. పనవ్వలేదు. స్వయంగా వాళ్లే భోజనానికి వెళ్లారు. అర కోటి నుంచి బేరం మొదలైంది... చివరికి రూ.2 కోట్లకు డీల్ కుదిరింది. అక్కడికి వచ్చిన వారు కూడా ఆశ్చర్యపోయారు. అలాగే భీమిలిలో ఓ జెడ్పీటీసీ సభ్యుడికి రూ.10 లక్షల ధర పలికింది. మరికొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు బేరాలు కుదిరినట్లు తెలిసింది. కొంతమంది మాజీ నేతలు, పలుకుబడి ఉన్న నేతలకు కూడా మరో రేటు ఫిక్స్‌చేసినట్లు సమాచారం.

సీఎం రమేష్ రాకతో పెరిగిన రేట్లు

300 మంది రౌడీ మూకలను వెంటబెట్టుకొని అనకాపల్లిలో అడుగుపెట్టిన మాజీ టీడీపీ, ప్రస్తుత బీజేపీ నేత సీఎం రమేష్ రాకతో.. ఆయా ప్రతినిధులు తమ రేట్లను అమాంతం పెంచేసుకుంటున్నారు. తమను నమ్ముకొని ఉన్న ప్రజలను పక్కన పెట్టేసి.. తమకింత ఇస్తే చాలు.. మీ పార్టీ కండువా కప్పేసుకుంటామంటూ బేరాలాటలో మునిగి తేలుతున్నారు. ఎన్నికల సమయంలో డబ్బులకు అమ్ముడుపోయి.. పార్టీ కండువాలు మార్చేసుకుంటూ.. టీడీపీ పంచన చేరుతున్న నేతలను చూసి జనం ఛీ కొడుతున్నారు. ఇలాంటి వారినా మనం సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జెడ్పీటీసీగా గెలిపించామా అని అసహ్యించుకుంటున్నారు.

రక్షణ, వాణిజ్య రంగాల్లో కీలకంగా షిప్‌యార్డు

- **కేంద్ర రక్షణ** మంత్రిత్వ శాఖ కార్యదర్శి **గిరిధర్ అర్మణే**
- **ఫ్లీట్ సపోర్ట్** షిప్ స్టీల్ కటింగ్ ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న అర్మణే, ఈఎన్‌సీ చీఫ్ పెంధార్కర్, హెచ్ఎస్ఎల్ సీఎండీ కమొడర్ ఖత్రి

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్‌లో దేశ రక్షణ రంగం, వాణిజ్య రంగాల్లో విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ కీలకంగా మారనుందని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గిరిధర్ అర్మణే అన్నారు. హిందూస్థాన్ షిప్‌యార్డు(హెచ్ఎస్ఎల్) ఇటీవల ఫ్లీట్ సపోర్ట్ షిప్(ఎఫ్ఎస్ఎస్) కాంట్రాక్ట్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు తొలి ఎఫ్ఎస్ఎస్ నిర్మాణ పనులను షిప్‌యార్డులో బుధవారం ఆయన ప్రారంభించారు. షిప్ నిర్మాణానికి అవసరమైన 44 వేల టన్నుల స్టీల్ కటింగ్‌కు పూజలు నిర్వహించి పనులు మొదలు పెట్టారు. స్లిప్‌వే విస్తరణ, యార్డు సామర్థ్య పెంపు, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ పనులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్మణే మాట్లాడుతూ నౌకాదళ సామర్థ్యాలు విస్తరించడంతో పాటు వ్యూహాత్మక కార్యచరణ పెంపొందించడానికి తొలి అడుగు పడిందన్నారు. హెచ్ఎస్ఎల్ ప్రభుత్వానికి బలంగా నిలుస్తోందని అభివర్ణించారు. షిప్‌బిల్డింగ్, వాణిజ్య రంగాల నుంచి వచ్చే ఆర్డర్లతో రాబోయే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొని.. ప్రపంచంలోనే నౌకా నిర్మాణంలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు హెచ్ఎస్ఎల్ కేంద్ర బిందువుగా మారుతోందని తెలిపారు. షిప్‌యార్డు సీఎండీ కమొడర్ హేమంత్‌ఖత్రి మాట్లాడుతూ విశాఖపట్నం పరిసరాల్లోని 550 ఎంఎస్ఎంఈల సహకారంతో నౌకా నిర్మాణంలో కీలకంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా 3 వేల మందికి పైగా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, షిప్‌యార్డు అధికారులు, నౌకాదళ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలోకి ఇతర పార్టీల నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. భీమిలిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ, జనసేన నాయకులు భారీగా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారికి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ సంపంగి రాము, గండిబోయిన రమణ, పాలవలస రవి, బంటుపల్లి అప్పలనాయుడు, సంపంగి శ్రీను, బుత్తల ప్రకాష్‌రాజు, బుత్తల రమణ, బుత్తల త్రినాథ్, రామం తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

అనుచరులతో టీడీపీ వార్డు మెంబర్ చేరిక

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ ఆరో వార్డు మెంబర్, టీడీపీ నాయకుడు కోరాడ సత్యనారాయణ తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాబును చూస్తే ఊసరవెల్లి సిగ్గుపడుతుంది

వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై చంద్రబాబు యూ టర్న్ చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే మన ప్రాణాలు మనం తీసుకున్నట్టేనన్నారు. సీఎం వైఎస్ జగన్ ఉత్తరాంధ్రలో ఆరులైన్ల రహదారులు, భోగాపురం ఎయిర్‌పోర్టు, మెడికల్ కళాశాలలు, పోర్టుల నిర్మాణంతో అభివృద్ధి చేస్తుంటే... చంద్రబాబు రాజధానిని అమరావతికి తీసుకుపోయి తన సామాజిక వర్గాన్ని మాత్రమే అభివృద్ధి చేసుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. గతంలో గంటాను గెలిపిస్తే ఒక్క గ్రామంలోనూ కనిపించలేదన్నారు. తాను గత ఐదేళ్లలో ఒక్కో పంచాయతీని 16 సార్లు సందర్శించడమే కాకుండా 127 సచివాలయాల పరిధిలో గడపగడపకూ తిరిగానన్నారు. ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకుడు బంటుపల్లి మణిశంకరనాయుడు, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, ఇల్లపు వెంకట్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత గంటాతో సహా ఆ పార్టీ నాయకులెవరూ మరో ఐదేళ్లు కనిపించరన్నారు. భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించుకుందామన్నారు.



సత్యనారాయణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సీఎం బస్సుయాత్రకు సన్నాహాలు

- రూట్ మ్యాప్ గురించి చర్చించిన వైవీ సుబ్బారెడ్డి
- ఈనెల 20న అనకాపల్లి జిల్లాలో ప్రవేశించనున్న బస్సు యాత్ర



వైవీ సుబ్బారెడ్డితో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, బొడ్డేడ ప్రసాద్, మలసాల భరత్‌కుమార్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను అనకాపల్లి జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏఎస్ పేటలోని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నివాసంలో బస్సు యాత్ర రూట్ మ్యాప్ గురించి పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి బుధవారం రాత్రి చర్చించారు. పాయకరావుపేట నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర యలమంచిలి, తాళ్లపాలెం, కశింకోట, అనకాపల్లి, తుమ్మపాల మీదుగా సాగుతుంది. అనంతరం చోడవరం నియోజకవర్గంలో ప్రవేశిస్తుంది. ఈ మేరకు రూట్ మ్యాప్‌ను రూపొందించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా మలసాల భరత్‌కుమార్ సుబ్బారెడ్డికి దుశ్శాలువా కప్పి సత్కరించారు. పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాపులకు సముచిత స్థానం



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ 43వ వార్డు ప్రచార కార్యదర్శి బత్తుల సంజీవనాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు. చిత్రంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు తదితరులు

- వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి
- బొత్స ఝాన్సీ, కె.కె.రాజుకు మద్దతు పలికిన కాపు సామాజిక వర్గ ప్రతినిధులు

మద్దిలపాలెం: కాపు సంఘం తమకు మద్దతు పలకడం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి అన్నారు. కాపు సేనా సంఘం ఆధ్వర్యంలో బుధవారం బిర్లా జంక్షన్ దరి బొత్స స్క్వేర్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి పార్టీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాపు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కట్టుబడి ఉన్నారని, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పార్లమెంట్‌కు సంబంధించి ఐదు స్థానాలను కాపు సామాజిక వర్గానికి కేటాయించారని, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కాపు నేస్తం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కాపులకు అండగా నిలిచారని చెప్పారు. కె.కె.రాజు మాట్లాడుతూ మీ మధ్యే, మీ కుటుంబ సభ్యుడిగానే ఉంటానని కాపులకు కె.కె.రాజు హామీ ఇచ్చారు. ఇనార్బిట్ మాల్, రహేజా వంటి పెద్ద సంస్థల ద్వారా నియోజకవర్గంలో రూ.1,400 కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చామన్నారు. ఆయా సంస్థల ఏర్పాటు పనులు పూర్తయితే కనీసం 2 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. గత టీడీపీ పాలనతో ఉత్తరాంధ్రలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, సీఎం వైఎస్ జగన్ హయాంలో ఉత్తరాంధ్రకు సముచిత స్థానం లభించిందన్నారు. అనంతరం కాపు కుల ప్రతినిధులను బొత్స ఝాన్సీ, కె.కె.రాజు సన్మానించారు. పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్న కాపు సామాజిక వర్గ ప్రజలు వారికి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ 43వ వార్డు ప్రచార కార్యదర్శి బత్తుల సంజీవనాయుడుకు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కాపు సేన సంఘం గౌరవ అధ్యక్షుడు బి.ఎస్.మూర్తి, అధ్యక్షుడు రాధాకృష్ణ, అడ్వైజర్ అండ్ కన్వీనర్ టి.చంద్రమౌళేశ్వరరావు, జనరల్ సెక్రటరీ లంక భాస్కరరావు, జనపరెడ్డి సత్యారావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ పి.ఉషశ్రీ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ మహిళా విభాగం సిటీ జనరల్ సెక్రటరీ మాసిన లక్ష్మి, రవీంద్రనాథ్ ఠాగూర్, మూర్తి, శేషు, రాధాకృష్ణ, కాపు నాయకులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు 3,4 ప్లాట్‌ఫాంల సిద్ధం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో 3, 4 ప్లాట్‌ఫాంలను రైళ్ల రాకపోకలకు సిద్ధం చేశారు. ఈ నెల 8న మూడవ నంబర్ గేట్ ఎదురుగా 3, 4 ప్లాట్‌ఫాంల మధ్య పాదచారుల వంతెన కుంగిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్లాట్‌ఫాంలపై నుంచి రైళ్ల రాకపోకలను నిషేధించారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టిన వాల్తేర్ డివిజన్ అధికారులు.. ముందుగా ఈ ప్లాట్‌ఫాంలను రైళ్ల రాకపోకలకు సిద్ధం చేశారు. భద్రత చర్యల్లో భాగంగా 3–4 ప్లాట్‌ఫాంల మధ్య వంతెనకు సంబంధించిన గర్డర్‌లను, స్టీల్ ట్రస్‌లను తొలగిస్తున్నారు. పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున.. ప్రస్తుతానికి ప్రయాణికులను ఈ వంతెనపైకి అనుమతించడం లేదు. త్వరలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే నుంచి ఉన్నతస్థాయి అధికారులు స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నారు. అనంతరం వంతెనను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకువస్తామని రైల్వే అధికారులు తెలిపారు. చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ రాజ్‌కుమార్, చీఫ్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎం, సివిల్ ఇంజినీరింగ్ అధికారులు బుధవారం ఈ పనులను పర్యవేక్షించారు.

అప్పన్న చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- ఉదయం 3.30 నుంచి 4.30 గంటల వరకే అంతరాలయ దర్శనాలు
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ మల్లికార్జున



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. సీపీ రవిశంకర్, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, దేవదాయ శాఖ ఏడీసీ రామచంద్రమోహన్

మహారాణిపేట: మే 10న జరగనున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఈవో శ్రీనివాసమూర్తి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఇతర విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా దర్శనాలు ఉంటాయన్నారు. మే 10వ తేదీ ఉదయం 3.30 నుంచి 4.30 గంటల వరకు మాత్రమే అనువంశిక ధర్మకర్త, టీటీడీ నుంచి పట్టువస్త్రాలు సమర్పించే వారికి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు, దాతలకు అంతరాలయ దర్శనాలు ఉంటాయని స్పష్టం చేశారు. నగరంలో 7 నుంచి 10 బ్యాంకుల్లో టికెట్ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి, మే 6వ తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది కొండపైకి వాహనాల రాకపోకలను గణనీయంగా తగ్గించేలా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. భక్తులను కొండ దిగువ నుంచి పైకి తరలించేందుకు.. దర్శనం పూర్తయ్యాక కొండ దిగువన దించేందుకు తగినన్నీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులకు ఆ రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయంలో దర్శనం కోసం శ్లాట్ ఇవ్వాలని చెప్పారు.

టీడీపీ సభ అట్టర్ ఫ్లాప్

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస కూడలిలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. 10వేల మందితో అట్టహాసంగా సభ నిర్వహిస్తామని ఆ పార్టీ మండల నాయకులు ప్రకటించి అభాసుపాలయ్యారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం తరచూ పార్టీలు మార్చేవారిని ప్రోత్సహించకూడదని చుట్టుపక్కల పంచాయతీల ప్రజలు మొండిచేయి చూపించారు. ఓ దశలో ఉపాధి హామీ కూలీలకు మస్తర్లు వేసి సభకు తరలించాలని టీడీపీ నాయకులు చేసిన ప్రయత్నాలకు ఎన్నికల అధికారులు అడ్డుకట్ట వేశారు. దీంతో వెయ్యి మంది కూడా సభకు హాజరుకాకపోవడంతో టీడీపీ నాయకులు నైరాశ్యంలో మునిగిపోయారు.

మన బలం.. సీఎం జగన్

- ధైర్యంగా ఓటు అడిగే అవకాశాన్ని కల్పించారు
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, చిత్రంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్లమెంట్ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్

ఆరిలోవ: ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించి.. ఎన్నికల్లో గర్వంగా ఓటు అడిగే ధైర్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనందరికీ కల్పించారని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైతే కార్యకర్తల గౌరవం మరింత పెరుగుతుందన్నారు. లాసన్స్‌బే కాలనీలోని తన కార్యాలయంలో బుధవారం వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పుట్టినిల్లు విశాఖలో సేవ చేయడానికి అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ ప్రజల కష్టాలు తెలుసుకుని.. రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు వెళ్లి సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఇలాంటి మంచి పాలన అందించిన పార్టీలో పనిచేయడం మన అదృష్టమన్నారు. అధిక సంఖ్యలో కార్పొరేషన్ చైర్మన్లు ఇక్కడ ఉన్నారని.. అందరం కలసి మళ్లీ మన ప్రభుత్వాన్ని తెచ్చుకుందామన్నారు. పేదవారు, పెత్తందార్ల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఒక సైన్యంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికార కాంక్ష, కుట్రలతో కూటమిగా ఏర్పడ్డారని, ప్రజలకు ఏదైనా మంచి చేయాలన్న ఆలోచన వారికి లేదన్నారు. వైఎస్సార్ సీపీలో జరిగిన అభివృద్ధిని ధైర్యంగా ప్రజలకు చెప్పగలుగుతున్నామన్నారు. కూటమి కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వదులుకునే ప్రసక్తే లేదని అన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థితో పాటు అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి పార్టీ క్యాడర్ అంతా కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లలో ఎక్కువ మంది విశాఖకు చెందిన వారినే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారన్నారు. విశాఖ నాయకులపై నమ్మకంతో ఇన్ని పదవులు ఇచ్చిన ఆయనకు ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించుకుని కానుకగా ఇద్దామన్నారు. ఎన్నికల్లో కలసికట్టుగా ప్రచారంలో పాల్గొనాలన్నారు. ఎంపీ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లకు ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఉత్సాహంగా ప్రచారం చేపట్టి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పేర్ల విజయచందర్, చొక్కాకుల వెంకటరావు, బొడ్డు అప్పలకొండ, పిల్లి సుజాత, వడ్డాది మధుసూదనరావు, జాన్ వెస్లీ, శోభా స్వాతి రాణి, అనూష పట్నాయక్, మాధవీవర్మ, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, అటవీ శాఖ వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి సాయం చేయబోయి మృత్యు ఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- అతివేగమే ప్రమాదానికి కారణం
- భీమిలి బీచ్‌రోడ్డులో విషాదం



చిన్న అప్పలరాజు (ఫైల్‌ఫొటో)



వీరభద్రం మృతదేహం

కొమ్మాది: అర్ధరాత్రి వేళ స్నేహితుడికి సాయం చేద్దామని స్కూటీపై వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదానికి బలయ్యాడు. బైక్‌పై మరో యువకుడు అతివేగంగా వస్తూ అతన్ని ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ఈ ఘటనలో ఆ యువకుడు కూడా మృతి చెందగా.. ఆ బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. భీమిలి బీచ్‌రోడ్డులో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. రుషికొండ ప్రాంతానికి చెందిన దొలపల్లి చిన్న అప్పలరాజు (25) ఏ1 గ్రాండ్‌లో బాయ్‌గా పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. అప్పలరాజుకు మంగళవారం అర్ధరాత్రి ఓ స్నేహితుడు ఫోన్ చేసి తన బండి ఆగిపోయిందని, భీమిలికి రమ్మని చెప్పాడు. వెంటనే స్కూటీపై అప్పలరాజు బయలుదేరాడు. తిమ్మాపురం బ్రిడ్జి వద్దకు వస్తుండగా.. జాలరిపేటకు చెందిన పాట్నూరు వీరభద్రం, రాజు, దుర్గ భీమిలి నుంచి అతి వేగంగా వస్తూ అప్పలరాజు వాహనాన్ని బలంగా ఢీ కొట్టారు. ఈ సంఘటనలో వీరభద్రం, అప్పలరాజు సంఘటన స్థలంలో మృతి చెందారు. రాజు, దుర్గలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. భీమిలి సీఐ డి.రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. భీమిలి బీచ్‌రోడ్డులో విశాఖ వైపు వెళ్లే మార్గ మధ్యలో తిమ్మాపురం వద్ద వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బ్రిడ్జిని ఓ వైపు తొలగించి, నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఒక వైపు నుంచి మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడ ఎటువంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

విషాదంలో రుషికొండ : స్నేహితుడికి సహాయం చేద్దామని వెళ్లిన అప్పలరాజు ప్రమాదంలో మృతి చెందడంతో రుషికొండ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. అందరితో సరదాగా ఉంటూ.. ఆపద అంటే సహాయం చేసే అప్పలరాజు మృతిని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: టిట్లాఘడ్ – సింగపూర్ రోడ్ సెక్షన్ పరిధి లాంజీఘడ్ రోడ్ – అంబోడల – డోయ్‌కల్లు స్టేషన్ల మధ్య జరుగుతున్న పనుల కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం – రాయ్‌పూర్ (08527), రాయ్‌పూర్ – విశాఖపట్నం (08528), విశాఖపట్నం – భవానీపట్న (08504), సంబల్‌పూర్ – రాయగడ (18301), రాయగడ – సంబల్‌పూర్ (18302) ఈ నెల 15 నుంచి 24 వరకు రద్దు చేశారు. భవానిపట్న – విశాఖపట్నం (08503) పాసింజర్ ఈ నెల 16 నుంచి 25 వరకు రద్దు చేశారు. దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల నిమిత్తం ఈ నెల 11 నుంచి 28 వరకు రాజమండ్రి – విశాఖపట్నం – రాజమండ్రి (07466/07467) పాసింజర్ రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 11న భువనేశ్వర్ – ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1 గంటకు భువనేశ్వర్‌లో బయల్దేరుతుంది.
- ఈ నెల 15, 18న నిజాముద్దీన్ – విశాఖపట్నం (12808) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా ఉదయం 8 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 18న విశాఖపట్నం – భగత్‌కోటి (18573) ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 7.50 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 22న నిజాముద్దీన్ – విశాఖపట్నం (12808) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 9 గంటలకు బయల్దేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు...

- ఈ నెల 15 నుంచి 24 వరకు బయల్దేరే టాటానగర్ – ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ టాటా, జరోలి, జఖపుర, కటక్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 14 నుంచి 23 వరకు బయల్దేరే ఎర్నాకుళం – టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ విజయనగరం, ఖుర్దారోడ్, కటక్, జఖపుర, జరోలి, టాటానగర్ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 21న బయల్దేరే విశాఖపట్నం – బెనారస్ (18311) ఎక్స్‌ప్రెస్ విజయనగరం, ఖుర్దారోడ్, అంగుల్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 22న బయల్దేరే బెనారస్ – విశాఖపట్నం (18312) ఎక్స్‌ప్రెస్ ఝార్సుగూడ, సంబల్‌పూర్ సిటీ, అంగుల్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు ఆయా తేదీల్లో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్ – సంత్రగచ్చి (07223) సమ్మర్ స్పెషల్ సికింద్రాబాద్‌లో ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28న ఉదయం 7.05 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.57 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి – సికింద్రాబాద్ (07224) సమ్మర్ స్పెషల్ సంత్రగచ్చిలో ఈ నెల 20, 27, మే 4, 11, 18, 25, జూన్ 1, 8, 15, 22, 29న మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 2.03 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.05 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 2.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్ – షాలిమర్ (07225) సమ్మర్ స్పెషల్ సికింద్రాబాద్‌లో ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24న ఉదయం 4.30 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.05 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్ – సికింద్రాబాద్ (07226) సమ్మర్ స్పెషల్ షాలిమర్‌లో ఈ నెల 16, 23, 30, మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18, 25న ఉదయం 10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1.25 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 1.30 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 1 గంటకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

బెంగళూరుకు చెందిన భార్యాభర్తల అరెస్ట్



భార్యాభర్తలను విచారిస్తున్న దువ్వాడ పోలీసులు

కూర్మన్నపాలెం: ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా చేస్తున్న భార్యాభర్తలను దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ.. బెంగళూరులో నివాసముంటున్న భార్యాభర్తలు నాగరాజు, భారతికి ఇద్దరు పిల్లలు. కుక్కలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వీరికి చంద్రప్ప అనే వ్యక్తి పరిచయమయ్యాడు. వీరి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న చంద్రప్ప నర్సీపట్నం వెళ్తే అక్కడ ఓ వ్యక్తి గంజాయి ఇస్తాడని.. దానిని తీసుకువస్తే అధిక మొత్తంలో నగదు ఇస్తానని ఆశ చూపాడు. రవాణా చార్జీలు కూడా తానే భరిస్తానని చెప్పడంతో భార్యాభర్తలిద్దరూ ఈ నెల 8న బెంగళూరు నుంచి తుని చేరుకున్నారు. అక్కడ నుంచి బస్సులో నర్సీపట్నం వెళ్లి బస్టాండ్‌లో బస చేశారు. బుధవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ఓ వ్యక్తి వచ్చి గంజాయి బ్యాగులను వారికి అందజేశాడు. దీంతో చంద్రప్ప నర్సీపట్నం నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. అక్కడి నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు రావాలని ఫోన్‌లో వారిని ఆదేశించాడు. రెండు కిలోలు చొప్పున 7 ప్యాకెట్లలో 14 కిలోల గంజాయితో వారు నర్సీపట్నం నుంచి విశాఖకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేట్ వద్ద అధికారులు, దువ్వాడ పోలీసులు బస్సు తనిఖీ చేయగా.. వారి వద్ద గంజాయి పట్టుబడింది. భార్యాభర్తలను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.75వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివాహిత మృతి కేసులో మరో మలుపు

హత్య చేసింది ఇద్దరు?

సీతమ్మధార: వివాహిత కలదారపు ఈశ్వరి మృతి కేసు మరో మలుపు తిరిగింది. ఆమెను ఇద్దరు హత్య చేసినట్లు ద్వారకా పోలీసుల దర్యాప్తులో తేలింది. ద్వారకానగర్ రెండవ లైన్‌లోని రామ్స్ ప్లాజాలో ఈ నెల 8న వాచ్‌మన్ కుమార్తె కలదారపు ఈశ్వరి(33) అనుమానాస్పదంగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నెల 8న ఈశ్వరి స్పృహ తప్పిపోయిందని ఆటోడ్రైవర్‌కు చెప్పి రైల్వే న్యూ కాలనీ శ్రీనివాసనగర్‌లోని తన ఇంటికి సయ్యద్ అలీ తీసుకొచ్చాడు. అక్కడ తన స్నేహితుడు ఒడిశాకు చెందిన జితేంద్ర సబత్‌తో కలిసి ఆమెను హత్య చేశాడు. అనంతరం రామ్స్ ప్లాజాలో ఈశ్వరిని వదిలివెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్య జరిగిన తర్వాత జితేంద్ర ఒడిశా వెళ్లిపోయాడు. దీంతో అతని కోసం పోలీసులు ఒడిశా వెళ్లారు. ఎ-1 నిందితుడిగా సయ్యద్ అలీ, ఎ-2గా జితేంద్ర సబత్‌ను ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు తెలిసింది.

బార్ కౌన్సిల్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గ సభ్యులు


విశాఖ లీగల్: న్యాయవాదుల సంఘం కొత్త కార్యవర్గం బుధవారం కొలువుదీరింది. సంఘం మాజీ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది బెవర సత్యనారాయణ ప్రమాణం చేశారు. అనంతరం ఉపాధ్యక్షుడిగా ఇమంది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా దంత నరేష్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా అడపా సుధాకరరావు, కోశాధికారిగా ఎస్.అశోక్ కుమార్, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.శివసింహాద్రి, గ్రంథాలయ కార్యదర్శిగా కె.మాధవీలత, పలువురు కార్యనిర్వాహక సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు కె.రామజోగేశ్వరరావు, సంఘం ఎన్నికల అధికారి కె.నరసింహామూర్తి, సీనియర్ న్యాయవాదులు యు.ఎస్.ఆర్.రాజు, కె.పృథ్వీరాజ్, బి.వి.ఆర్.మూర్తి, పైలా శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మత్స్యకారుడి మృతి

- ఈ నెల 5న సముద్రంలో అగ్నిప్రమాదం
- జనరేటర్ పేలిన ఘటనలో 9 మందికి గాయాలు
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించిన సత్తిబాబు

మహారాణిపేట: సముద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మత్స్యకారుడు బుధవారం మరణించాడు. గత నెల 26న కాకినాడ నుంచి ట్యూనా చేపల వేట కోసం ఐఎన్‌డీ ఏపీ 47 బోటు వేటకు వెళ్లింది. ఈ నెల 5న విశాఖకు 20 నాటికల్ మైళ్ల దూరంలో బోటులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. జనరేటర్ పేలి మంటలు చెలరేగాయి. ఈ మంటలు క్షణాల్లో వ్యాప్తి చెందాయి. ఆ సమయంలో బోటులో ఉన్న 9 మంది మత్స్యకారులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఏపీ మర పడవల సంఘం ఆధ్వర్యంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణ కోస్ట్‌గార్డ్ నౌకలను అప్రమత్తం చేశారు. కోస్ట్‌గార్డ్ నౌక ఐసీజీఎస్ వీరాలో గాయపడ్డ వీరిని ఒడ్డుకు తీసుకొచ్చి.. ముందు నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం కేజీహెచ్‌కు తీసుకొచ్చి బర్న్స్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఆర్.సత్తిబాబు(40) ఆరోగ్యం మంగళవారం రాత్రి నుంచి క్షీణించింది. 81 శాతం మేర కాలిపోయిన ఆయన బుధవారం ఉదయం ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఐసీయూలో మరో ఇద్దరు, వార్డులో ఆరుగులు చికిత్స పొందుతున్నట్లు కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి మోహనరావు తెలిపారు.

ఫొటో మార్ఫింగ్ చేసి వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్



దబ్బీరు సాయికుమార్

విశాఖ సిటీ: మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి నకిలీ జీమెయిల్ ఐడీ ద్వారా పంపించి వేధిస్తున్న వ్యక్తిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన యువతి ఒక ప్రముఖ కంపెనీలో పని చేస్తోంది. సదరు యువతికి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోతో పాటు చెడుగా అదే కంపెనీలో పనిచేస్తున్న సుమారు 500 మంది ఉద్యోగులకు మెయిల్స్ వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న బాధిత మహిళ ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో వారు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికత సహాయంతో ఆ మెయిల్స్ పంపించింది అదే కంపెనీకి చెందిన మాజీ ఉద్యోగి అయిన నగరానికి చెందిన డబ్బీరు సాయికుమార్ అని గుర్తించి అరెస్టు చేశారు. సాఫ్ట్‌వేర్‌లో మంచి పరిజ్ఞానం ఉన్న సాయికుమార్ ఎవరికి దొరకకుండా ఉండేందుకు నకిలీ ఈమెయిల్‌ను క్రియేట్ చేసి వీపీఎన్ ద్వారా ఐపీలను మార్చి యువతిని వేధించాడు. అయినప్పటికీ పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారు.